
సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



పెళ్లికానుకకు మంగళం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. 8లో ▸



పునాది దశలోనే విద్య బలోపేతం

ఉపాధ్యాయుల్లో అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు ఎఫ్‌ఎల్‌ఎన్ పేరుతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సోమవారం నుంచి శిక్షణ మొదలుకానుంది. 8లో ▸



అలరించిన నృత్యాలు

ఏలూరులో అభినయ నృత్యభారతి సంస్థ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజులుగా కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. 8లో ▸

న్యూస్‌రీల్

నేడు ఆరుద్రోత్సవం



క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఆరుద్రోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు కిష్టప్ప తెలిపారు. నాలుగు తిథులు కలిసి రావడం ప్రత్యేకమన్నారు. సోమవారం, మార్గశిర మాసం, పాడ్యమి (నెలపొడుపు), పరమేశ్వరుడు జన్మ నక్షత్రం ఆరుద్ర రావడం అరుదుగా జరుగుతుందన్నారు. వేకువజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి జీవిత సాఫల్య పురస్కారం



అవార్డు అందుకుంటున్న వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం: ఉద్యాన, వ్యవసాయ రంగాల్లో 35 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ కె.గోపాల్‌కు జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. తీపి నారింజ, పులుపు నిమ్మ, ఉల్లి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల్లో పరిశోధనలకు పురస్కారం వచ్చింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయంలో ఇటీవల జరిగిన ఇండియన్ ఫైటోపాథలాజికల్ సొసైటీ, డెక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ పాథాలజిస్టు, అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పురస్కారం అందుకున్నారు. గోపాల్ 25 మందికి పైగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. 165కు పైగా రీసెర్చ్ పేపర్లు, ఐదు పుస్తకాలు రచించారు. ఇండియన్ ఆఫ్ ప్లాంట్ పాథాలజీకి అధ్యక్షత వహించారు. పదికిపైగా సొసైటీల్లో జీవిత కాలం సభ్యత్వం ఉంది.

5,616 కేసుల పరిష్కారం



సి.పురుషోత్తంకుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈనెల 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5,616 పెండింగ్ కేసులను పరిష్కరించామని డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదివారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 33 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరులో 7, భీమవరంలో 4, కొవ్వూరులో 4, నరసాపురంలో 4, తణుకులో 4 తాడేపల్లిగూడెంలో 3, పాలకొల్లులో 2, నిడదవోలులో 1, జంగారెడ్డిగూడెంలో 1, చింతలపూడిలో 1, భీమడోలులో 1 చొప్పున బెంచీలను ఏర్పాటుచేశామన్నారు. 5,259 క్రిమినల్, 170 మోటార్ వాహన ప్రమాద బీమా, 187 సివిల్ కేసులు, అలాగే 87 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు. ఏలూరులో 1,197, భీమవరంలో 601, నరసాపురంలో 434, పాలకొల్లులో 213, తాడేపల్లిగూడెంలో 756, తణుకులో 617 కేసులు పరిష్కరించామన్నారు.

పశువధ.. దందా

- తణుకులో పశువధ కర్మాగారం
- హైకోర్టు స్టేతో కొన్నేళ్లపాటు నిలిచిపోయిన పరిశ్రమ
- టీడీపీ నేతల సహకారంతో ఇటీవల పునః ప్రారంభం!
- కోర్టు స్టే కారణంగా పంచాయతీ ఎన్‌ఓసీ నిరాకరణ
- 'సేవ్ తణుకు' అంటూ సోషల్ మీడియాలో క్యాంపెయిన్
- వారం రోజులుగా ఆందోళనలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్సీ బొత్స ఫిర్యాదు



తణుకు మండలం తేతలిలో కర్మాగారం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పశువధ పరిశ్రమ అడ్డగోలు దందాకు తెరతీసింది. పరిశ్రమ ప్రారంభించడానికి వీల్లేదని హైకోర్టు స్టే ఉండటం, ఈ కారణంగా పంచాయతీ ఎన్‌ఓసీ ఇవ్వడానికి నిరాకరణ, స్థానికంగా ఏళ్ల తరబడి నుంచి కర్మాగారాన్ని తెరవవద్దంటూ తీవ్రంగా వ్యతిరేకిస్తూ గో సంరక్షణ సమితి ఆందోళనలు, స్థానికుల తీవ్ర వ్యతిరేకతలు ఇన్ని అడ్డంకులున్నా అధికార పార్టీ అండతో అడ్డగోలుగా పరిశ్రమను అనధికారికంగా ప్రారంభించడం తణుకులో తీవ్ర దుమారం రేపింది. వారం రోజులుగా తణుకు ప్రాంతంలో జరుగుతున్న నిరసనలు ప్రభుత్వానికి ఫిర్యాదుల వరకు వెళ్లాయి.

2013 నుంచి వివాదం..

తణుకులోని తేతలి గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యవాడ రోడ్డులో లేహం ఫుడ్ ప్రొడెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 2013–14లో కర్మాగారాన్ని ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుని అనుమతి పొందారు. 2015–16లో నిర్మాణాలు ప్రారంభించగా 2016లో స్థానికుల ఆందోళనలతో నిర్మాణాలు నిలిపివేశారు. అప్పటి నుంచి అదేవిధంగా కొనసాగుతూ వచ్చింది. 2018లో నిర్మాణం పూర్తి చేసి 2022లో ట్రయిల్ రన్ ప్రారంభించడంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వరరావు స్థానికులతో కలిసి అడ్డుకుని ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి పరిశ్రమను తాత్కాలికంగా నిలుపుదల చేయించారు. తదనంతరం స్థానికులు హైకోర్టుకు వెళ్లి పంచాయతీ తీర్మానం, నిర్మాణానికి అనుమతులు లేవని స్టే తీసుకురావడంతో పరిశ్రమ నిలిచిపోయింది. అనుమతులు తీసుకునే క్రమంలో రోజుకి 400 గేదెలు, ఇతర పశువులు వధించి మాంసాన్ని ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తామని అప్పటి ప్రభుత్వంలో పరిశ్రమ నిర్వాహకులు అనుమతులు పొందారు. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో, ప్రభుత్వంలోని పెద్దల ఆశీస్సులతో ఈ పరిశ్రమకు అనుమతులు వచ్చి నిర్మాణాలు ప్రారంభమై స్థానిక వివాదాలతో నిలిచిపోతూ వచ్చింది. 2022లో హైకోర్టు స్టేతో పరిశ్రమ నిర్వాహకులు కూడా పూర్తిగా వదిలేశారు.

కొత్తగా అనుమతులు కోరుతూ..

ఈ పరిణామాల క్రమంలో ఈ ఏడాది సెప్టెంబర్ 23న కర్మాగారాన్ని ప్రారంభించడానికి వీలుగా ఎన్‌ఓసీ కోరుతూ పంచాయతీకి రిజిస్టర్ పోస్టు చేశారు. కర్మాగారం వ్యవహారం కోర్టులో స్టే ఉండటంతో ఎన్‌ఓసీ ఇవ్వలేమని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని రాతపూర్వకంగా అక్టోబర్ 1న పంచాయతీ కార్యదర్శి సమాధానమిచ్చారు. వాస్తవానికి పరిశ్రమ ఏర్పాటుకు ముందే గ్రామ పంచాయతీ తీర్మానం, నిర్మాణానికి ప్లాన్‌కు పంచాయతీ అనుమతితో పాటు పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో సహా అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే వీటిలో కీలకమైనది పంచాయతీ అనుమతి. హైకోర్టులో రిట్ పిటిషన్ 12397/2022 నంబర్ కేసు ఇంకా పెండింగ్‌లో ఉన్న కారణంగా పంచాయతీ తీర్మానం ఇవ్వడం లేదని కార్యదర్శి స్పష్టం చేశారు.

అనధికారికంగా ప్రారంభం ?



తేతలి గ్రామంలో పశువధ కర్మాగారం

అనుమతుల వ్యవహారం ఓ వైపు నడుస్తుండగానే రాజకీయ సహకారంతో అనధికారికంగా పరిశ్రమ ప్రారంభించి పశువధకు తెరతీశారు. దాదాపు నెల రోజులుగా వందల సంఖ్యలో పశువులు వధించి ఎగుమతులు చేస్తున్నారు. పరిశ్రమ అనధికారికంగా ప్రారంభమైన క్రమంలో తణుకు పరిసర ప్రాంతాల్లో గేదెల దొంగతనాలు జోరందుకున్నారు. కొద్దిరోజుల క్రితం వేల్పూరులో రెండు గేదెలు అపహరణకు గురైతే దొంగలను అరెస్టు చేశారు కాని పశువులను రికవరీ చేయలేకపోయారు. నిత్యం రాత్రిళ్లు పశువులను తరలిస్తున్నారని, పట్టణంలో రోడ్లపై ఉండే పశువులు కనిపించడం లేదంటూ గో సంరక్షణ సమితి సభ్యులు ఆందోళన చేస్తున్నారు. పరిశ్రమ ప్రారంభమైందన్న సమాచారంతో గో సంరక్షణ సమితి సభ్యులు, స్థానికులు వారం రోజులుగా తీవ్రస్థాయిలో ఆందోళనలు నిర్వహించారు. అధికార పార్టీకి ముడుపులు అందడంతో గ్రామస్థాయి అధికారుల నుంచి పోలీసుల వరకు ఇబ్బంది లేకుండా దందా నడుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉధృతంగా 'సేవ్ తణుకు'

ఈ ఘటన సోషల్ మీడియా క్యాంపెయిన్‌గా మారిపోయింది. దాదాపు 100కు పైగా ఫిర్యాదులు అధికారులకు అందడంతో పాటు 'సేవ్ తణుకు' అంటూ క్యాంపెయిన్ ఉధృతంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రభుత్వ సెలవు అయినా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కె.నర్సింహరావు పేరుతో పత్రికా ప్రకటన విడుదలైంది. కర్మాగారంలో గోవధ జరగడం లేదని, ఇతర దేశాలకు గేదె మాంసం ఎగుమతికి అగ్రికల్చరల్ అండ్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రొడెక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతితో నడుపుతున్నారని వివరించారు.

చర్యలు తీసుకోవాలి

గ్రామ పంచాయతీ తీర్మానం, నిర్మాణానికి సరైన అనుమతులు లేకుండా అనధికారికంగా ప్రారంభమైన పశువధ కర్మాగారాన్ని తక్షణమే మూసివేయాలని తీవ్రస్థాయిలో ఆందోళనలు చేస్తున్నట్లు తణుకు గోసేవా సమితి నేత కొండ్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. పరిశ్రమ అనధికారికంగా ప్రారంభమైనా చర్యలు తీసుకోవడంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ అధికారులు విఫలమయ్యారని వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో పాటు న్యాయస్థానంలో కేసు దాఖలు చేస్తామని శ్రీనివాస్ చెప్పారు.

ఎమ్మెల్యే ఆరిమిల్లి పైనా ఆరోపణలు

రాత్రిళ్లు కర్మాగారంలో గోవధ చేస్తున్నారని తణుకు గోసేవా సమితి నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంపై టీడీపీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పైనా స్థానికులు ఆరోపణలు గుప్పించారు. కోట్లాది రూపాయలు చేతులు మారడంతోనే పరిశ్రమ ప్రారంభమైందని ఆరోపణలు వచ్చిన క్రమంలో అక్కడ గోవధ జరగడం లేదని అయినా ఏం జరుగుతుందో అధికారులను పంపి తెలుసుకుంటానని ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించి మరీ ప్రకటించారు. ఈ పరిణామాల క్రమంలో ఈనెల 9న తణుకు వచ్చిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు తణుకు గోసేవా సమితి సభ్యులు పరిశ్రమను అడ్డుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు బొత్స సత్యనారాయణ లేఖ ద్వారా ఫిర్యాదు చేసి పరిశ్రమను ప్రారంభించకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేసి దీనిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని కోరారు.

అమరజీవి త్యాగం అజరామరం



భీమవరంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా మావుళ్లమ్మ గుడిరోడ్డులో విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయులు పొట్టి శ్రీరాములని అన్నారు. వబిలిశెట్టి రామకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నివాళులు

భీమవరం(ప్రకాశంచౌక్): ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలోని అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలన సందర్భంగా పర్యటన ఏర్పాట్లను ఆదివారం జేసీ పి.ధాత్రిరెడ్డి పర్యవేక్షించారు. పోలవరం ప్రాజెక్ట్ వ్యూపాయింట్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాట్లు, ప్రాజెక్ట్ పురోగతి పనులు సందర్శించే ప్రాంతా లను, పార్కింగ్, వీఐపీ గ్యాలరీ, సమావేశపుహాలు తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

పొట్టి శ్రీరాములుకు ఘోర అవమానం

- నివాళులను మరచిన మంత్రులు
- వెళ్లిపోతున్న సమయంలో హడావుడిగా దండలు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు అనిత, నిమ్మల, కలెక్టర్, ఎస్పీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘోర అవమానం జరిగింది. స్థానికంగా నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సొంత ప్రచారంలో పడి అమరజీవి 72వ వర్ధంతి కార్యక్రమాన్ని మరచిపోయారు. సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమం ఏర్పాటుచేసిన గాంధీబొమ్మల సెంటర్‌లోనే పలువురు దేశ నాయకులు విగ్రహాలు ఉన్నాయి. స్టేజీ కూడా ఈ విగ్రహాల పక్కనే ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం 2కే రన్ ప్రారంభించిన మంత్రులు తిరిగి వెళిపోతున్న సమయంలో ఎవరో గుర్తుచేయగా.. హడావుడిగా అమరజీవికి నివాళులర్పించారు. బాధాకరమైన విషయమేంటంటే.. 'దండలు తీసుకురండి..' అని చెప్పగా అక్కడున్న వ్యక్తులు స్టేజీపై పడి ఉన్న దండలను ఏరుకుని మంత్రులకు ఇవ్వడం.. వాటినే మంత్రులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి వేయడం. అలాగే గాంధీబొమ్మల సెంటర్‌లో 13 విగ్రహాలు ఉండగా గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు మాత్రమే దండలు వేసి అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్ రామ్, ప్రకాశం పంతులు వంటి మిగిలిన మహానేతల విగ్రహాలకు దండలు వేయకుండా వెళ్లిపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల కోసమా.. మంత్రి ప్రచారం కోసమా..

సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కే రన్ కార్యక్రమంలో భాగంగా స్టేజీపై ఏర్పాటుచేసిన బ్యానర్‌లో ఎక్కడా ఒక్క అమ్మాయి ఫొటో గాని, మహిళ ఫొటో గాని లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. బ్యానర్‌పై మంత్రి నిమ్మల ఫొటో మాత్రమే వేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో ఈ కార్యక్రమాన్ని మహిళల కోసం ఏర్పాటు చేశారా లేక మంత్రి ప్రచారం కోసం ఏర్పాటు చేశారా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళలపై దాడులను సమైక్యంగా ఎదుర్కొందాం

పాలకొల్లు సెంట్రల్: తల్లిదండ్రులు అబ్బాయిలతో పాటు అమ్మాయిలను సమానంగా పెంచితే సమాజంలో బాలికలపై దాడులు, సమస్యలు తగ్గముఖం పడతాయని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కే రన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అందరూ సమైక్యంగా మహిళలపై దాడులను అరికట్టాలన్నారు. సినిమాల్లో మాఫియాలుగా, స్మగ్లర్లుగా హీరోయిజం కోసం చూపిస్తారని, యువత వాటిని ఆచరణలోకి తీసుకోకూడదన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరించి ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆడపిల్లలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, సమాజం కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సినీ గాయకురాలు మధుప్రియ, టీవీ సీరియల్ నటి దీపిక రంగరాజన్, డీఎస్పీ వేద, ఆర్డీఓ దాశి రాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి దెబ్బతో రోడ్డున పడ్డ ఎంపీహెచ్‌ఏలు

మా పొట్ట కొట్టొద్దు

- ఉమ్మడి పశ్చిమలో 104 సిబ్బందికి ఉద్వాసన
- 21 ఏళ్లుగా సేవలందిస్తున్నా తొలగించడంపై ఆగ్రహం
- తక్షణం విధుల్లోకి తీసుకోవాలంటూ డిమాండ్



ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎంపీహెచ్‌ఏ వర్కర్లు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కొత్త ఉద్యోగాల మాట అలా ఉంచితే ఉన్న ఉద్యోగాలను ఊడపీకుతోందని వివిధ సంఘాల నాయకులు గళమెత్తుతున్నారు. 21 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) (ఎంపీహెచ్‌ఏ) వర్కర్లను కోర్టు ఆదేశాల సాకుతో ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా తొలగించింది. దీంతో వీరంతా రోడ్డున పడ్డారు. విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఇటీవల ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వీరంతా 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 104 మంది వర్కర్లను 2012లో జీఓ 273 ఇంప్లిమెంటేషన్‌లో భాగంగా తొలగించగా.. వీరు అప్పట్లో ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో జీఓ 1207 ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. మరలా కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో 2017లో వారినీ విధుల్లోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 30న హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా కోర్టు తీర్పు కాపీలు బయటకు రాకుండానే ఈనెల 5న ఏకపక్షంగా వీరందరినీ విధుల్లోంచి తొలగించారు. తామంతా 50 ఏళ్లు దాటిన వారమని, ఇప్పుడు ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఏ పని వెదుక్కోగలమని ఆవేదన చెందుతున్నారు. ఇన్నేళ్ల తమ కష్టాన్ని గడ్డిపరకగా తీసిపారేశారని వాపోతున్నారు.

ఏకపక్ష తొలగింపుపై ఆగ్రహం : ఉమ్మడి జిల్లాలో 104 మంది ఉద్యోగులను ఏకపక్షంగా విధుల్లోంచి తొలగించడంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కోర్టు తీర్పులో 120 రోజుల సమయం పైతం ఇచ్చినా కేవలం ఐదు రోజుల్లోనే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

అధికారుల తప్పిదం వల్లే..



అధికారుల తప్పిదం వల్లే మా ఉద్యోగాలు ఊడాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా జీఓ నం.1207తో తమను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు తమను జీఓ నం.1207లో పెట్టి తొలగించకుండా డబ్ల్యూపీ.నం.38060/2013లో పెట్టి తొలగించారు. దీంతో మా ఉద్యోగాలు పోయాయి. జీఓను మార్చి 1207లో పెట్టి తొలగిస్తే మాకు న్యాయం జరుగుతుంది.

– డీవీ రామకృష్ణ, గుడివాకలంక, ఏలూరు మండలం

ప్రాణాలకు తెగించి పనిచేశాం



కరోనా సమయంలో మేం మా ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు సేవలు అందించాం. పర్మినెంట్ ఉద్యోగులంతా భయంతో బయటకు రాకపోయినా అన్నీ మేమే అయ్యి పనిచేశాం. దానికి ప్రతిఫలంగా ప్రమోషన్‌లు, రెగ్యులర్ చేస్తారని భావించాం. తీరా చూస్తే కోర్టు ఉత్తర్వుల సాకుతో ఇప్పుడు ఏకంగా విధుల్లోంచే తొలగించేశారు.

– జి.చంద్రశేఖర్, తూర్పుతాళ్లు, నరసాపురం మండలం

ఈ వయసులో ఎలా బతికేది ?



తామంతా ప్రస్తుతం 50 ఏళ్లు దాటి ఉన్నాం. హఠాత్తుగా విధుల్లోంచి తొలగిస్తే ఇప్పుడు మేం ఎలా బతికేది. ఏం చేసేది. మా కుటుంబాలను ఎలా పోషించేకోవాలో అర్థం కాని పరిస్థితి. దీనిపై కూటమి ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా స్పందించి మాకు న్యాయం చేయాలి. మాలాంటి చిరు ఉద్యోగులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం తగదు.

– ఆర్.శ్రీనివాసరావు, రేలంగి, ఇరగవరం మండలం

వృత్తిలో భాగంగా ప్రమాదాలు



గ్రామాల్లో పనిచేసే సమయంలో వృత్తిలో భాగంగా పలుమార్లు నేను ప్రమాదాలకు గురయ్యాను. అయినా వృత్తినే నమ్ముకుని పనిచేస్తూ వచ్చాను. ప్రస్తుతం నా వయస్సు 52 ఏళ్లు. చేతికంది వచ్చిన పిల్లలు ఉన్నారు. వారి చదువులు, వివాహాలు వంటివి ఎలా పూర్తిచేయాలో తెలియని పరిస్థితి. మాలాంటి చిరుద్యోగులపై కనికరం చూపాలి.

– దీపజీ సభాపతి, కొండలరావుపాలెం, పెదవేగి మండలం

మండలిలో పశ్చిమ ఘనత



కొయ్యే మోషేన్‌రాజు, మండలి చైర్మన్



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



బొర్రా గోపిమూర్తి, టీచర్ ఎమ్మెల్సీ

- చైర్మన్‌తో కలిపి నలుగురు సభ్యులు
- తాజాగా టీచర్ ఎమ్మెల్సీ కైవసం
- గత ప్రభుత్వంలోనే ముగ్గురికి అవకాశం

భీమవరం(ప్రకాశం చౌక్): రాజకీయ చైతన్యానికి పశ్చిమగోదావరి జిల్లా పెట్టింది పేరు. జిల్లాకు చెందిన వారు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాసనమండలిలో ఎక్కువ మంది సభ్యులు ఉన్న జిల్లాగా మరో ఘనత సాధించింది. జిల్లాకు చెందిన వారు నలుగురు ఎమ్మెల్సీలుగా ఉన్నారు. శాసనమండలి సభ్యులుగా ఇప్పటికే ముగ్గురు సేవలందిస్తుండగా తాజాగా ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన బొర్రా గోపిమూర్తి 'పశ్చిమ'కు చెందిన వారే కావడం విశేషం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ జిల్లాపై అభిమానంతో ముగ్గురికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారు. వారిలో కొయ్యే మోషేన్‌రాజు మండలి చైర్మన్ కాగా ఎమ్మెల్సీలుగా వంకా రవీంద్రనాథ్ (తణుకు), కవురు శ్రీనివాస్ (పాలకొల్లు) ఉన్నారు. జిల్లాలోని యలమంచిలి మండలం నార్నిమెరకకు చెందిన బొర్రా గోపిమూర్తి తాజాగా ఎమ్మెల్సీగా గెలుపొందడంతో ఈ సంఖ్య నాలుగుకు చేరింది. సాధారణంగా ఏ జిల్లాకు చెందిన వారు అయిన ఎమ్మెల్సీలుగా ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే ఉంటారు. అయితే ఇక్కడ నలుగురు ఉండటం జిల్లా ఖ్యాతిని మరింత పెంచింది. శాసనమండలిలో జిల్లాల వారీగా సభ్యుల సంఖ్య చూస్తే ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఉన్న జిల్లాగా పశ్చిమగోదావరి నిలిచింది. ప్రజాసమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి నలుగురు ఎమ్మెల్సీలు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రెండోసారి కూడా శాసనమండలి చైర్మన్ పదవి జిల్లా వాసులకు దక్కడం మరో విశేషం. గతంలో టీడీపీ ఎమ్మెల్సీగా ఎంఎం షరీఫ్ మండలి చైర్మన్‌గా పనిచేయగా.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా కొయ్యే మోషేన్‌రాజు శాసనమండలి చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

క్లుప్తంగా

వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపిక



నన్నయ యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు ఎంపికైన శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాలకొల్లు ఏఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థి గుబ్బల శ్రీనివాస్ ఎంపికయ్యాడు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో జి.మామిడాడలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో శ్రీనివాస్ పాల్గొని యూనివర్సిటీ టీంకు ఎంపికైనట్లు ఏఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడు. యూనివర్సిటీ టీంకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ తదితరులు అభినందించారు.

బాంబ్ స్క్వాడ్ డీఎస్పీపై తేనెటీగల దాడి

బుట్టాయగూడెం: తేనెటీగల దాడిలో బాంబ్ స్క్వాడ్ డీఎస్పీ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పోలవరం ప్రాజెక్టు వద్ద జరిగింది. సీఎం చంద్రబాబునాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన నేపథ్యంలో పోలీసులు పోలవరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ నంబర్ 23 వద్ద బాంబ్ స్క్వాడ్ డీఎస్పీ జి.రామకృష్ణ తనిఖీలు చేస్తున్న సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దాడిలో డీఎస్పీకి తీవ్రగాయాలు కావడంతో ఆయనను హుటాహుటిన సిబ్బంది రాజమండ్రి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ డీఎస్పీకి చికిత్స అందిస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి



పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్సై సుధీర్, సిబ్బంది

ద్వారకాతిరుమల: మండలంలోని లైన్ గోపాలపురం శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఎస్సై టి.సుధీర్ సిబ్బందితో కలసి ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 9 మంది పందెం రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.52,080 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులతో పాటు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కుక్కునూరు మండలంలో..

కుక్కునూరు: వంజంవారిగుంపు గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ, తన సిబ్బందితో కలిసి ఈ దాడులు జరిపారు. పందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3220 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పేకాట, కోడిపందేలు నిర్వహించిన లేదా పాల్గొన్నా చర్యలు తీసుకుంటామన్నారు.

● లక్ష అరటి పండ్ల పూజ



హనుమద్ వ్రత ఉత్సవాలలో భాగంగా సరిపల్లి సమీపంలోని సంజీవ ఆంజనేయస్వామికి లక్ష అరటి పండ్లతో ఆదివారం విశేష పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో మూడో రోజున స్వామికి పంచామృతాభిషేకం చేశారు. సోమవారం సువర్చల సహిత హనుమద్ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.
– కొయ్యలగూడెం

● బీచ్‌లో సరదాగా..



మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ల్లో ఆదివారం సందర్శకుల రాకతో సందడి నెలకొన్నాయి. గత రెండు రోజులుగా మబ్బుగా ఉండటంతో సందర్శకుల సంఖ్య తగ్గింది. వాతావరణం చల్లగా ఉన్నా బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.
–మొగల్తూరు

● వైభవంగా తెప్పోత్సవం



కైకరం షష్ఠి తిరునాళ్ల ముగింపురోజైన శనివారం రాత్రి నాగమ్మ తల్లి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు బాణసంచా కాల్పులు, డప్పు వాద్యాల నడుమ తెప్పోత్సవం జరిపారు. హంస వాహనంపై నాగమ్మ జలవిహారం వైభవంగా సాగింది. తొలుత నాగమ్మ తల్లి పుట్టిల్లైన అద్దేపల్లి శేషయ్య, మెట్టినిల్లు శానం బాబ్జి ఇళ్ల వద్ద అమ్మవారికి పసుపు కుంకుమ, సారె సమర్పించారు.
– ఉంగుటూరు

పెళ్లి కానుకకు మంగళం

- జిల్లా వ్యాప్తంగా 1200 మంది ఎదురుచూపులు
- కనీసం దరఖాస్తులు స్వీకరించని వైనం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 2,371 మందికి పెళ్లికానుక, షాదీ తోఫా
- పేద తల్లిదండ్రులకు రూ.16.34 కోట్ల సాయం



గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు పెళ్లి కానుక చెక్కు అందిస్తున్న దృశ్యం(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయం అందించి ఆడపిల్లల తల్లితండ్రులను ఆర్థికంగా ఆదుకోవాలని గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో ఆదుకున్నారు. రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు సాయం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెళ్లి చేసుకున్న ఒక్కరికీ పెళ్లి కానుక, షాదీ తోఫా కింద పైసా ఆర్థిక సాయం అందించలేదు. ఈ ప్రభుత్వం పెళ్లికానుక ఊసే ఎత్తడం లేదు.

1200 మంది ఎదురుచూపులు

పెళ్లి కానుక, షాదీ తోఫా పథకం ఈ ప్రభుత్వం అమలు చేస్తుందా? లేదా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకే దిక్కు లేదు. అలాంటిది పెళ్లి కానుక పథకం అమలు చేస్తారా? అనే ప్రశ్న ఉంది. ఈ ఏడాది మార్చి నుంచి డిసెంబర్ 5 వరకు మూడు విడతలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 1200 మంది ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగాయి. 1200 మంది లబ్ధిదారులు పెళ్లి కానుక ద్వారా ఆర్థిక సాయం అందుతుందని ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు ఇలా..

- ఎస్సీ, ఎస్సీలకు రూ.లక్ష
- ఎస్సీలు కులాంతరం వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు
- ఎస్టీలకు రూ.లక్ష
- ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు
- బీసీలకు రూ.50 వేలు, కులాంతరం వివాహం చేసుకుంటే రూ.75 వేలు
- మైనార్టీలకు రూ.లక్ష
- దివ్యాంగులకు రూ.1.50 లక్షలు
- ఓసీల్లోని భవన నిర్మాణ కార్మికుల పిల్లల వివాహానికి రూ.40 వేలు

గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు భరోసా ఉండేది. నేడు పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్లల పెళ్లికి గతంలో మాదిరిగా అప్పులు చేయాల్సిన పరిస్థితి.

ఐదు విడతలుగా రూ.16.34 కోట్లు

గత ప్రభుత్వంలో ఐదు విడతలుగా పెళ్లి కానుక, షాదీ తోఫా అందించారు. ఐదో విడత కలుపుకుని మొత్తం 2,364 మంది లబ్ధిదారులకు రూ.16.34 కోట్లను వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఇందులో ఎస్సీల్లో 615 జంటలకు రూ.6.15 కోట్లు, బీసీల్లో 1,406 జంటలకు రూ.7.03 కోట్లు, దివ్యాంగులు 34 జంటలకు రూ.51 లక్షలు, మైనార్టీల్లో 31 జంటలకు రూ.31 లక్షలు, బీసీల్లో కులాంతర వివాహం చేసుకున్న 136 జంటలకు రూ.1.20 కోట్లు, ఎస్సీల్లో కులాంతర వివాహం చేసుకున్న 80 జంటలకు రూ.96 లక్షలు, ఎస్టీల్లో 15 జంటలకు రూ.15 లక్షలు, ఎస్టీల్లో కులాంతర వివాహం చేసుకున్న 3 జంటలకు రూ 3.60 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల్లో 44 జంటలకు రూ 1.76 కోట్లు అందించారు.

మండలాల వారీగా సాయం

మండలం	లబ్ధిదారులు	రూ.లక్షల్లో
ఆచంట	112	82.95
ఆకివీడు	112	77.65
ఆకివీడు అర్బన్	4	2.50
అత్తిలి	109	70.85
భీమవరం	194	135.85
యలమంచిలి	127	91.95
గణపవరం	55	39.01
ఇరగవరం	98	60.7
కాళ్ళ	93	61.53
మొగల్తూరు	103	67.4
నర్సాపురం	118	75.9
పాలకోడేరు	106	71.00
పాలకొల్లు	164	11.59
పెంటపాడు	95	68.75
పెనుగొండ	103	81.75
పెనుమంట్ర	94	66.01
పోడూరు	101	77.15
తణుకు	132	83.15
ఉండి	106	71.04
వీరవాసరం	103	64.45
తాడేపల్లిగూడెం	164	12.60
నర్సాపురం అర్బన్	61	42.01

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన నాగాలాండ్‌కు చెందిన లూంచ్ (24)

జంగారెడ్డిగూడెం: అనుమానాస్పద స్థితితో యువకుడు మృతి చెందాడు. స్థానిక రిలయన్స్ స్మార్ట్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రిలయన్స్ స్మార్ట్ సమీపంలోని భవనంలో చిన్న గదిలో భార్య భారతితో కలిసి నాగాలాండ్‌కు చెందిన లూంచ్(24) ఉంటున్నాడు. ఒక రెస్టారెంట్‌లో వంటమేస్త్రీగా పనిచేసేందుకు ఐదేళ్ల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చాడు. భుక్యా భారతి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఆరు నెలల పాప ఉంది. ఆదివారం చిన్నారికి అన్నప్రాసన వేడుక కావడంతో భారతి అమ్మమ్మ ఊరైన బుట్టాయిగూడెం మండలం కోయరాజమండ్రిలో జరిపేందుకు లూంచ్, అతడి భార్య శనివారం వెళ్లారు. అక్కడ భార్య భారతి, 6 నెలల పాపను దిగబెట్టి లూంచ్ జంగారెడ్డిగూడెం ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ఇంటి పక్కన ఖాళీ స్థలంలో లూంచ్ దుస్తులు లేకుండా విగతజీవిగా పడిఉన్నాడు. చుట్టపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్లు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

బుట్టాయగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ఉమామహేశ్వరరావు అన్నారు. బుట్టాయగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్నే సవాలు చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వెనుకబడి ఉన్నారన్నారు. కొన్ని విషయాల్లో వైఫల్యాలు చెందారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి త్యాగం చేస్తున్న ప్రజలను నీటిలో ముంచే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. నిర్వాసితులకు పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించడానికి సుమారు రూ.35 వేల కోట్లు అవసరమవుతుందని అన్నారు. ఈ సమస్యపై తమ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపడం లేదన్నారు. అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు పెంచమని చెప్పిన చంద్రబాబు సర్దుబాటు పేరుతో ప్రజలపై పెనుభారం మోపుతున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధనాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలపై రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

పునాది దశలోనే విద్య బలోపేతం

- 1, 2 తరగతుల టీచర్లకు ప్రత్యేక శిక్షణ
- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 2,599 మంది ఎంపిక
- నేటి నుంచి మార్చి వరకూ 18 బ్యాచ్‌లకు శిక్షణ



ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శిక్షణా తరగతి గదుల ఏర్పాటు

నిడమర్రు: జాతీయ విద్యావిధానం -2020కు అనుగుణంగా అభ్యసన ఫలితాల్లో మెరుగుదలకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రైమరీ స్థాయిలో బోధించే 1,2 తరగతులు ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1, 2 తరగతులు బోధిస్తున్న 2,599 మంది ఉపాధ్యాయులు హాజరవనున్నారు. వీరిలో జిల్లాకు 75 మంది చొప్పున 18 బ్యాచ్‌లుగా తరగతులకు హాజరవ్వాలి.

భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద మొదటి విడత సోమవారం నుంచి ఈనెల 21 వరకూ ఈ శిక్షణా తరగతులు నిర్వహించేందుకు పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇటీవల రెసిడెన్షియల్ విధానంలో ఇద్దరు టీచర్లు గుండెపోటుతో మృతి చెందిన సంఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారులు నాన్ రెసిడెన్షియల్‌కు తొలిసారి అవకాశం ఇచ్చారు.

60 రోజుల సర్టిఫికెట్ కోర్సు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 1, 2 తరగతులు బోధిస్తున్న మొత్తం 2,791 మంది టీచర్ల ఏడాదికి 20 రోజుల చొప్పున 3 ఏళ్ల పాటు 60 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి మొదటి విడతలో 192 మంది ఈ కోర్సు పూర్తి చేశారు. ఈ శిక్షణ అనంతరం 14 రోజుల ఆన్‌లైన్ శిక్షణ ఉంటుంది. ఇలా మూడేళ్లపాటు మొత్తం 60 రోజులు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ నిర్వహిస్తారు.

తప్పనిసరిగా హాజరవ్వాలి

1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులందరూ తప్పని సరిగా ఈ శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. తొలి 3 స్పెల్‌లో ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్న స్కూల్ నుంచి శిక్షకుల్ని ఎంపిక చేశారు. 4వ స్పెల్ నుంచి మహిళలకు, అనంతరం సింగిల్ టీచర్స్ ఉన్న ఎస్టీటీలను భాగస్వామ్యులుగా ఎంపిక చేస్తారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రాజెక్టుకు బీజం

ఏపీలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో 2021 నుంచి సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమం 6 ఏళ్లపాటు నిర్వహించేలా వైఎస్సార్‌సీపీ సర్కారులోనే బీజం పడింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటి వరకూ వివిధ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల శిక్షణలు ఉపాధ్యాయులకు ఇచ్చారు. దీని కొనసాగింపులో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఈ శిక్షణకు అధికారులు శ్రీకారం చుట్టారు.

ఈ జ్ఞాన ప్రకాశ్ 60 రోజుల శిక్షణ ప్రధాన లక్ష్యం సెంకడరీ గ్రేడ్ టీచర్ల బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఫౌండేషన్‌ను(పునాది) బలోపేతం చేయడం, ఈ కోర్సులో తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు పెంచేలా చేయడం, సంఖ్యాశాస్త్ర బోధనలో మెళకువలకు ప్రాధాన్యత ఇస్తారు.

జిల్లా	మొత్తం టీచర్లు	శిక్షణ పూర్తి చేసుకున్నవారు
ఏలూరు	1,445	97
పశ్చిమగోదారి	1,346	95
మొత్తం	2,791	192

ఎవరికీ మినహాయింపు లేదు



సమగ్ర శిక్ష స్టేట్ అధికారుల ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో రాష్ట్ర స్థాయి జాబితాలో ఎంపిక చేసిన 1, 2 తరతులు బోధిస్తున్న టీచర్లు అందరూ తప్పనిసరిగా హాజరవ్వాలి. ఈ జ్ఞాన ప్రకాష్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు ఎవ్వరికీ మినహాయింపులేదు.
–ఇ. నారాయణ, డీఈవో, పశ్చిమ గోదావరి జిల్లా

నాన్ రెసిడెన్షియల్‌కు అవకాశం



నాన్ రెసిడెన్షియల్‌గా ఉండేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. జాబితాలో ఉన్న టీచర్ ఏదైనా కారణం చేత హాజరవక పోయినా తర్వాత స్పెల్ తప్పనిసరిగా హాజరవ్వాల్సి ఉంటుంది.
– పి.శ్యామ్ సుందర్, ప్రాజెక్ట్ అధికారి, సమగ్ర శిక్ష

అక్రమ మద్యం పట్టివేత



జీలుగుమిల్లిలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్, ఆటో

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో నిర్వహించిన తనిఖీల్లో సుంకం చెల్లించని 210 తెలంగాణ మద్యం సీసాలు పట్టుబడినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీలుగుమిల్లిలో తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణకు చెందిన 210 మద్యం సీసాలు ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. ఆటోను సీజ్ చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై జి.వెంకటలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

దెందులూరు: మండలంలో కొమరేపల్లి- గుండుగొలను వద్ద జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. కొమరేపల్లి గ్రామంలో రొయ్యల చెరువులో అస్సాం రాష్ట్రానికి చెందిన రాజ్నాథ్ బర్మన్ నీటి కోసం దిగాడు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. మండవల్లి మండలం దెయ్యంపాడు గ్రామానికి చెందిన ముంగర పాండురంగారావు ద్విచక్ర వాహనంపై తోకలపల్లి వెళ్తూ గుండుగొలను వద్ద రోడ్డు దాటుతుండగా ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళ్లే కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో రంగారావు కుడికాలు, చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్సై శివాజీ తెలిపారు.

28 నుంచి బాలోత్సవం పోటీలు

భీమవరం: పట్టణంలో ఈ నెల 28, 29 తేదీల్లో బాలోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శ్రీచింతలపాటి బాపిరాజు హైస్కూల్‌లో 14 అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భీమవరం, ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు, వీరవాసరం మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. 22లోపు ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను 99490 93115 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

అలరించిన నృత్యాలు





నృత్య ప్రదర్శన చేస్తున్న రిత్విక్ వెంకట్, చార్మిల వెంకట్, దువ్వి రూపేష్ చంద్ర

గత మూడు రోజులుగా నగర ప్రజలను విశేషంగా అలరిస్తున్న నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ 29వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన స్రవంతి సుకేష్ ప్రదర్శించిన నృత్యాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు నృత్య కౌముది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం హైదరాబాద్‌కే చెందిన రిత్విక్ వెంకట్, చార్మిల వెంకట్, ఏలూరుకు చెందిన దువ్వి రూపేష్ చంద్ర, కె.పూర్ణశ్రీ, ఎస్.కావ్య సిద్ధిక ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.
– ఏలూరు(ఆర్ఆర్‌పేట)

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముమ్మరంగా వరి నాట్లు

- మొదలైన రబీ సీజన్ వ్యవసాయ పనులు
- తాడేపల్లిగూడెంలో బెంగాలీ కూలీలతో నాట్లు
- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పూర్తి



నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో దాళ్వా వరి నాట్లు వేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. గత నెలలోనే రైతాంగం చేలను మాగ దమ్ము చేసి నారుమడి పోశారు. నారుమడి వేసి 21 రోజులు పూర్తి కావడంతో నాట్లు వేసే పనిలో రైతాంగం నిమగ్నమయ్యారు. ప్రధానంగా ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, చినతాడేపల్లి, పెదతాడేపల్లి, కుంచనపల్లి, మోదుగ గుంట, అప్పారావుపేట, కడియద్ద, కృష్ణాపురం, కృష్ణాయపాలెం, గొల్లగూడెం, నీలాద్రిపురం, పట్టింపాలెం, వెంకట్రామన్నగూడెం తదితర గ్రామాల్లో బెంగాలీ కూలీలు నాట్లు వేస్తున్నారు. ఎకరాకు ఇద్దరు కూలీల చొప్పున పని చేస్తున్నారు. నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.3600 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. బెంగాలీ కూలీలు, సాధారణ కూలీలు వేసే నాట్లలో వ్యత్యాసం ఉండటంతో రైతాంగం సైతం బెంగాలీ కూలీల వైపే ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు పడటంతో పాటు చీడపీడలు, పురుగుల ఉధృతి ఉండదని పేర్కొంటున్నారు. బెంగాలీ కూలీలు వేసే నాట్లు దూరదూరంగా ఉండి గాలి, వెలుతురు బాగా తగులుతుంది. దీంతో ఎక్కువగా పురుగు మందుల వినియోగం అవసరం ఉండదు. అలాగే కలుపు కూడా ఎక్కువగా పట్టదని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్, దాళ్వా సీజన్ ప్రారంభం కాగానే బెంగాలీ కూలీలు ఈ ప్రాంతానికి చేరుకుంటారు. ఈ రెండు సీజన్ల ప్రారంభం నుంచి చివరి వరకు ఈ ప్రాంతంలోనే ఉంటూ రైతాంగానికి కూలీల కొరతను తీరుస్తున్నారు. దీంతో రైతులు అధిక శాతం మంది ఈ బెంగాలీ కూలీలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో బెంగాలీ కూలీల రాక ప్రతి ఏడాది పెరుగుతూ వస్తుంది. దీని వలన వారికి ఉపాధి, స్థానిక రైతులకు అవసరాలు తీరుతున్నాయి. వీరి ద్వారా వరి నాట్లు ఆలస్యం లేకుండా సకాలంలో పడుతున్నాయని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు



బెంగాలీ కూలీలు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేస్తారు. 15 మంది కూలీలు రోజుకు ఏడెకరాల్లో నాట్లు వేయడం విశేషం. గాలి, వెలుతురు సమృద్ధిగా వచ్చేలా నాట్లు వేయడం వల్ల చీడపీడలు ఉండవు. తద్వారా పురుగు మందుల వినియోగాన్ని అరికట్టవచ్చు. కలుపు తీసే పని కూడా ఉండదు. దీంతో ఎక్కువ శాతం రైతాంగం బెంగాలీ కూలీలు వేసే నాట్లపైనే మక్కువ చూపుతున్నారు.

– పడాల మురళీరెడ్డి, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

కొండలరాయుడి ఆలయంలో హోమ పూజలు

అత్తిలి: స్థానిక గంటావారిపుంతలో కొలువైన శ్రీకొండలరాయుడు ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారి ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. శ్రీనాగమ్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలుచేశారు. ఆలయ అర్చకులు ఐలూరి సుబ్బయ్యశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ గురువు గొట్టుముక్కల సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (రూరల్) బి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కుంచనపల్లి, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సత్యవతి నగర్‌లోని శ్రీ కనక మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. జరిగాయి. ఆదివారం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అఖండ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ కె.గోపికృష్ణ, యాదల శివాజీ, అడ్డగర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి రాట ముహూర్తం



రాట ముహూర్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజా త్రినాథ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో వేంచేసిన శ్రీ పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాట ముహూర్తం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ముసలమ్మ ఆలయం వద్ద వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. పుంతలో ముసలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా త్రినాథ్, సభ్యులు సూరపరెడ్డి బాబు, వెలనాటి సత్తిబాబు, కర్రి సత్తిబాబు, కె.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం: గూడెం సర్కిల్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ ఇ.స్వర్ణలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పట్టణంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్సైలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.జ

వాసవీ మాతకు పౌర్ణమి పూజలు



వాసవీమాత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పౌర్ణమి పురస్కరించుకొని స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవీమాతకు ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో, ఫల రసాలతో, పసుపు, కుంకుమలతో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి రజిత చీరతో విశేష అలంకరణ చేశారు. సెక్రటరీ నున్న బాల త్రిపుర సందరరావు, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



శ్రీ పెంట్లమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలం కస్పా పెంటపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీపెంట్లమ్మ అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉంగుటూరు మండలం యర్రమళ్ల గ్రామస్తులు నక్కలపూడి మురళీకృష్ణ, రజిత దంపతులు అమ్మవారికి రూ.51,116 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పంతం శేఖర్, గంధం సతీష్, కొండయ్య, సంతోష్, చిన్ని, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

142 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాజ రాజేశ్వరీ రామకృష్ణన్ నిడదవోలు ఆసుపత్రి సిబ్బందితో పట్టణంలోని జనతా ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైన 28 మందికి ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 14 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కంటి పరీక్షల నిమిత్తం 21 మందిని రిఫర్ చేశారు. జోన్ ఛైర్మన్ సుంకర శ్రీనివాస్, కార్యదర్శి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు గ్రంధి సత్యనారాయణ, మానవత అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ, యర్ర ఆంజనేయ స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

100 మంది వైద్య పరీక్షలు

తణుకు టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 100 మంది వైద్య పరీక్షలు చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు చెప్పారు. ఆదివారం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మల్లిన అరుణ సారథి ప్రారంభించారు. ఈ శిబిరంలో నరాలకు సంబంధించిన వైద్య నిపుణులు డాక్టర్ పి.కృష్ణ కిషోర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కఠారి సిద్ధార్థ, అనపర్తి ప్రకాశరావు, డాక్టర్ వి.వెంకట్రాజు, కె.సత్యనారాయణరాజు, గమిని రాంబాబు, పోతుల శ్రీనివాసరావు, కేటీవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

తణుకు అర్బన్: స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం.. ఆనాటి ఆ స్నేహమెంతెంతో మధురం.. ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం అంటూ తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తణుకులో సందడి చేశారు. 30 ఏళ్ల నాటి స్నేహ బంధంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో శని, ఆదివారాల్లో తణుకు వేదికగా విహారయాత్రలు, వనసమారాధనలు నిర్వహించారు. తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాల ఆవరణకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువుల తల్లి భార్గవి ఎంతగా మారిపోయావే అని.. ఏరా శ్రీనివాసు ఇంకా ఆ అల్లరి మానేయలేదా అంటూ పలకరింపులు.. విద్యాభ్యాసంలో చేసిన అల్లరి పనులు, పాఠశాల ఎగ్గొట్టి ఆడిన ఆటలు, చూసిన సినిమాలు, గురువుల బెత్తం దెబ్బలు వంటి అంశాలు గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ, వ్యాపారాల్లో దూర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సైతం ఆత్మీయ కలయిక కోసం పాఠశాల వద్దకు రావడంతో 30 ఏళ్ల క్రితం నాటి తమ స్నేహాన్ని నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు యిండుగపల్లి బలరామకృష్ణ, పోలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు.

న్యాయవాద వృత్తిని నిర్వీర్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి మునిస్వామి

తణుకు అర్బన్: బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ఆలిండియా లాయర్ల యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్ల యూనియన్ ఉభయ జిల్లాల కమిటీ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు మేక ఈశ్వరయ్య అధ్యక్షతన ఆదివారం తణుకు బార్ అసోసియేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు న్యాయవాద వృత్తిలో ఏవైనా లోపాలు జరిగితే దానిపై విచారణ చేసే అధికారం ఆ రాష్ట్రంలోని బార్ కౌన్సిల్‌కు ఉన్నదని మునిస్వామి అన్నారు. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించి న్యాయ వ్యవస్థకు న్యాయవాదులపై చర్యలు తీసుకునే విస్తృత అధికారాలను కట్టబెట్టాలనే ఆలోచనలో ఉందని మునుస్వామి విమర్శించారు. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం ఎన్టీఆర్ నేస్తం వెంటనే విడుదల చేసి జూనియర్ న్యాయవాదులను ఆదుకోవాలన్నారు. బార్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.35 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు జరిగే సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ విధానంలో జూనియర్ న్యాయవాదులను మినహాయించాలని, జిల్లా స్థాయిలో క్లాసులు నిర్వహించాలని, స్థానిక బార్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లాలని, న్యాయవాదుల రక్షణకు సమగ్రమైన చట్టాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలని పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొవ్వూరు వెంకటేశ్వర్లు, పీపీ లక్ష్మి, పామర్తి నగేష్, కేవీ సుబ్రహ్మణ్యం, ధనాల అప్పారావు, పి.పెద్దిరాజు, వి.లలిత కుమారి, జి.రాజారావు, వై.మణికంఠతేజ, తదితరులు పాల్గొన్నారు.

అందమైన బొమ్మల దర్శకుడు బాపు



వైద్యులను సత్కరిస్తున్న సాహితీ సంస్థ ప్రతినిధులు

తణుకు టౌన్: అందమైన అమ్మాయికి మారుపేరుగా బాపు చిత్రాలు నిలుస్తాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సత్యనారాయణరాజు అన్నారు. ఆదివారం ప్రముఖ చిత్ర దర్శకుడు సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు) జయంతి సందర్భంగా తణుకు సాహితీ సామ్రాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ బాపు తెలుగు చిత్ర రంగంలో ప్రఖ్యాత దర్శకుడిగా నిలిచారని, ఆయన తన కొంటె బొమ్మలతో అశేష అభిమానులను ఆకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కఠారి సిద్ధార్థ, వేగేశ్న సత్యనారాయణరాజు, డాక్టర్ బంగారు రమేష్‌కుమార్, బోడపాటి ప్రసాద్, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పి.వీరభద్రం, రఘుమండ శ్రీను, పీవీ కొండలు, టీవీ సత్యనారాయణ, వీఎల్‌పీ కుమార్‌రాజు, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడు



తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం: ఉద్యాన విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



తణుకు టౌన్: పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమర జీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సూచనలతో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక వాసవీ ఆడిటోరియం వద్ద నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి భాషా సంయుక్త రాష్ట్రాలను ఏ భాష మాట్లాడే వారు ఆ రాష్ట్రంలో ఒక్కటిగా ఉండాలని ఆకాంక్షించారని చెప్పారు. 1952 డిసెంబర్ 19వ తేదీన అప్పటి ప్రధాని నెహ్రూ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించారని, రాష్ట్రాన్ని సాధించామని వివరించారు. కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, చిటికెన ప్రసాద్, గార్లపాటి వీర కుమార్, బొద్దాని శ్రీనివాస్, చామన సూర్యచంద్ర రావు, పాలూరి శివ, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ ఆడిటోరియం వద్ద పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్యులు కొర్లెపర రాము, నున్న సుందరం, వబిలిశెట్టి నటరాజు, కొండూరి రాము, పెనుగొండ శ్రీను, హనుమంతు, పెర్రాజు గుప్తా, రాంబాబు, ఏకాంబరం, పులవర్తి రాంపండు, రమేష్, ఆలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

తాడేపల్లిగూడెం: రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములని ఆదివారం ఉద్యాన విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో పలువురు నివాళులర్పించారు. గాంధీ బోధించిన సత్యం, అహింస సిద్ధాంతాలను శ్రీరాములు అనుసరించారన్నారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేం

తణుకు టౌన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమర జీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు తెలుగు జాతి మరువలేదని జిల్లా లయన్స్ సేవా ఛైర్మన్ వావిలాల సరళాదేవి చెప్పారు. ఆదివారం తణుకులోని జిల్లా పురుషుల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కొరు వెంకటేశ్వర్లు, జి.ఉష, ఎన్ఎస్ఎం లక్ష్మి, గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు




మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ డిఫెన్స్ అకాడమీ సౌజన్యంతో ఆశ్రం హాస్పిటల్ ఏలూరు వారిచే మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, పెడియాట్రిక్, గైనిక్, కంటి, చర్మ స్పెషలిస్ట్ వైద్యులచే 1500 మంది విద్యార్థులకు, ప్రజలకు వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. టీబీఆర్ గ్రూప్ ఛైర్మన్ భోగేశ్వరరావు, పీఆర్ఓ దుర్గాప్రసాద్, కరస్పాండెంట్ పద్మావతి, సీఈఓ రవికిరణ్, హెచ్ఎం కళ్యాణి, ఏఓ నాగరాజు, పాల్గొన్నారు.

17 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

అత్తిలి: మండలంలో ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు కోసం ఈ నెల 17 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఆధార్‌కార్డులు కలిగిన వారు నవీకరించుకోవచ్చని చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో అత్తిలి, తిరుపతిపురం, ఆరవల్లి గ్రామాల్లోనూ, 19, 20 తేదీల్లో మంచిలి, ఉనికిలి, బొంతువారిపాలెం, పాలి గ్రామాల్లోనూ, 26న గుమ్మంపాడు, ఉరదాళ్లపాలెం, 27, 28 తేదీల్లో బల్లిపాడు, కేఎస్ గట్టు, స్కిన్నెరపురం గ్రామాల సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు పని చేస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోలాహలంగా సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్ల



జెయింట్‌వీల్



తిరునాళ్లలో సందడి చేస్తున్న జనం



తిరునాళ్లలో దుకాణాల వద్ద సందడిగా కనిపిస్తున్న జనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్ల కోలాహలంగా నిర్వహించారు. పిల్లలు, యువతీ యువకులు షష్ఠిలో సందడి సందడి చేశారు. ఆదివారం పాఠశాలలకు సెలవు రోజు కావడంతో పిల్లలు షష్ఠిలో సందడి చేశారు. మిగతా రోజుల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో షష్ఠి తిరునాళ్లకు ప్రాధాన్యత కన్పిస్తుంది. శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, కొలంబస్, డ్రాగాన్ ట్రెయిన్, రంగుల రాట్నాలు ఆకర్షణీయంగా నిలిచాయి. వాటిని యువత, చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఎక్కి కేరింతలు కొడుతూ సంతోష పడ్డారు. వివిధ దుకాణాల వద్ద గృహ ఉపకరణాలు, గాజులు, కర్ర బొమ్మలు, స్టీల్ వస్తువులు, పిల్లలు ఆడుకునేందుకు వీలైన వివిధ ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పట్టణవాసులే కాక గ్రామీణ ప్రాంతాల నుంచి గృహిణులు, పిల్లలు, పెద్దలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఆనందోత్సవాల మధ్య తిరునాళ్లు కొనసాగుతున్నాయి.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం గ్రామంలో ఉన్న మహలక్ష్మి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజుకు వేదాశీర్వచనం అందించారు. అలాగే మోషేన్‌రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల సేవాదళ్ అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక కొత్తపేట బాబా ఆలయంలో వేంచేసియున్న దత్తాత్రేయస్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఉండి కాలువలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కాలువ గట్లపై భక్తులు నిలిచి స్వామి వారిని దర్శించుకుని ఆత్మీయ స్వాగతం పలికారు. విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లా కిరణ్ ప్రసాద్ నిర్వహించిన కార్యక్రమం ఉదయం నుంచి బాబా ఆలయంలో విశేష పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఆలయంలో చేపట్టిన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, స్వామి వారి సంకీర్తనలతో హోరెత్తింది. స్వామి వారికి తులసీదళ అలంకరణతో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు, అనంతరం ప్రసాద వితరణ చేపట్టినట్లు ఆలయ ప్రధానార్చకుడు సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు.